



కాపర్ కేటుగాళ్లు!

- జిల్లాలో యథేచ్ఛగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాపర్ దొంగతనాలు
- గత సంవత్సరం 184, ఈ ఏడాది 68 ట్రాన్స్‌ఫార్మర్ల దుండగుల ధ్వంసం
- కాపర్ వైరు చోరీలతో విద్యుత్‌శాఖకు కోట్ల రూపాయల్లో నష్టం

సుభాష్‌నగర్, సెప్టెంబరు 11: జిల్లాలో కాపర్ కేటుగాళ్లు రెచ్చిపోతున్నారు. పొలాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేస్తున్నారు. అందులోని కాపర్, ఆయిల్‌ను అపహరిస్తున్నారు. వాటిని విక్రయిస్తూ అందినకాడికి దోచుకుంటున్నారు. కాపర్ కేటుగాళ్ల పనితనానికి అటు విద్యుత్ శాఖ అధికారులు, ఇటు పోలీసులు, రైతులు బెంబేలెత్తిపోతున్నారు. జిల్లాలో ట్రాన్స్‌ఫార్మర్ల లోని కాపర్‌వైర్ల చోరీలు ఎక్కువవుతుండడంతో రైతులు పరేషాన్ అవుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లకు తాళం ఎలా వేయాలో తెలియక విద్యుత్ శాఖ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. పంట చేతికొచ్చే సమయంలో ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేయడంతో రైతులు నీరు పెట్టలేక నష్టపోతున్నారు. జిల్లా వ్యాప్తంగా ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. కాపర్ కోసం ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి దొంగతనాలకు పాల్పడుతు న్నట్లు గతంలోనే పోలీసులు గుర్తించారు. కాపర్‌కు బహిరంగ మార్కెట్‌లో డిమాండ్ ఉండడంతో ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి కాపర్‌ను ఎత్తుకెళ్తున్నారు. ముఖ్యంగా రోడ్లకు పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మలను టార్గెట్‌గా చేసుకుని దొంగ తనాలకు పాల్పడుతున్నారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది. ట్రాన్స్ ఫార్మర్ లేక పోవడంతో రోజుల తరబడి ఆరుతడి పంటలకు నీరు అందించడం కష్టతరంగా మారుతోంది. ఆర్మూర్, బోధన్ డివిజన్ పరిధిలో ట్రాన్స్‌ఫార్మర్ కాపర్ దొంగతనాలు గత కొద్దిరోజులుగా ఎక్కువగా జరుగుతున్నాయి.

విద్యుత్ శాఖకు భారీ నష్టం..

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసంతో విద్యుత్‌శాఖకు భారీ నష్టం వాటిల్లుతోంది. 2023-24 సంవత్సరంలో సుమారు 184 ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్‌వైర్లను దొంగిలించారంటే కాపర్ కేటుగాళ్ల పనితనం అర్థమవుతోంది. ఈ ఒక్క ఏడాదిలోనే విద్యుత్ సంస్థ సుమారు రూ.2కోట్ల 20లక్షల ఆస్తి నష్టాన్ని చవిచూసింది. 2024 సంవత్సరంలో ఇప్పటి వరకు సుమారు 68 ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి కాపర్ దొంగలు కాపర్‌వైర్లను దొంగిలించారు. వీటి ద్వారా సుమారు రూ.80లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. ఈ సంవత్సరంలోనే ఇప్పటి వరకు 68ట్రాన్స్‌ఫార్మర్లను దొంగిలించగా మరో ఐదు నెలలు ఇంకెన్ని ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం చేస్తారోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

యాంటీ తెఫ్టింగ్ లాక్ ఆపడం లేదు..

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం చేసి కాపర్‌ను ఎత్తుకెళ్తున్నారని ముందుజాగ్రత్తగా విద్యుత్‌శాఖ ట్రాన్స్‌ఫార్మర్లకు యాంటీ తెఫ్టింగ్ లాక్ బోల్టును వృద్ధిలోకి తెచ్చారు. ప్రత్యేక ఏర్పాట్లను చేసి ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం కాకుండా బోల్టును అమర్చారు. కాపర్ కేటుగాళ్లను మాత్రం ఇవేమీ ఆపడం లేదు. యాంటీ థెఫ్టింగ్ లాక్‌ను సైతం కోసివేసి దొంగతనాలకు పాల్పడుతున్నారు.

బహిరంగ మార్కెట్‌లో కాపర్‌కు డిమాండ్..

బహిరంగ మార్కెట్‌లో కాపర్‌కు ఎక్కువ డిమాండ్ ఉండడంతో కాపర్ కేటుగాళ్లు ట్రాన్స్‌ఫార్మర్లను టార్గెట్ చేస్తున్నారు. వీటిని జిల్లాతోపాటు ఇతర రాష్ట్రాల్లో అమ్మి సొమ్ముచేసుకుంటున్నారు. మార్కెట్‌లో కిలోకు సుమారు రూ.800నుంచి వెయ్యి రూపాయల వరకు పలుకుతుండడంతో కాపర్ వైర్ల దొంగతనాలు చేస్తున్నారు. కాపర్ కోసం ఇతర రాష్ట్రాల నుంచి దొంగలు జిల్లాకు చేరుకుని రాత్రి సమయాల్లో తమ పనిని ముగించుకుని దర్జాగా వెళ్తున్నారు.

పోలీసులు నజర్ వేయాలని వేడుకోలు..

వ్యవసాయ క్షేత్రాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు ఉండడంతో వాటిని కాపాడడం విద్యుత్ శాఖకు కష్టంగా మారింది. వేల సంఖ్యలో ట్రాన్స్‌ఫార్మర్లు ఉండడంతో ట్రాన్స్‌ఫార్మర్లను కాపర్ దొంగల నుంచి రక్షించలేక పోతున్నారు. రాత్రి సమయాల్లో కాపర్ కేటు గాళ్లు తమ పనిని కానిచ్చేయడంతో ఆ శాఖ అధికారులు ఏమీచేయలేకపోతున్నారు. కాపర్ దొంగలపై పోలీసులు నజర్ వేస్తే తప్ప వీటిని అరికట్టడం సాధ్యం కాదని రైతులు కోరుతున్నారు.

కాపర్ దొంగలపై చర్యలు తీసుకోవాలి..

: జగదీశ్వర్, రైతు, నవీపేట్

ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి రైతులకు నష్టం చేస్తున్న కాపర్ దొంగలపై కఠిన చర్యలు తీసుకోవాలి. ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసం వల్ల రైతులకు ఆర్థిక భారం పడుతుంది. ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతుల కోసం తీసుకుపోవడం, తీసుకురావడం ఇబ్బందికరంగా మారింది. కొత్తది అమర్చే వరకు పంటలు కూడా ఎండిపోతున్నాయి. విద్యుత్‌శాఖ అధికారులతో పాటు పోలీసులు కూడా కాపర్ దొంగలపై నజర్ వేయాలి.

దొంగతనాలను అరికట్టేందుకు కృషిచేస్తాం..

: శ్రీనివాస్, డీఈ, నిజామాబాద్

కాపర్ దొంగతనాలు జిల్లాలో ఎక్కువగా జరుగుతున్నాయి. దొంగతనాలు అరికట్టేందుకు ట్రాన్స్‌ఫార్మర్లకు యాంటి థెఫ్టింగ్ లాక్‌ను బిగించాం. అయినా దొంగలు వాటిని కోసివేసి దొంగతనాలకు పాల్పడుతున్నారు. ట్రాన్స్ ఫార్మర్లను కాపాడేందుకు గ్రామస్థాయిలో రైతు లకు అవగాహన కల్పిస్తున్నాం. పోలీసులను సైతం కాపర్ దొంగతనాలపై దృష్టిపెట్టాలని కోరాం.



నాలేశ్వర్‌లో ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న పోలీసులు



• ట్రాన్స్‌ఫార్మర్ పరికరాలు ఇలా..



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, పాల్గొన్న రాజకీయ నేతలు

ఓటరు జాబితా రూపొందించేందుకు నేతలు సహకరించాలి

• కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు


నిజామాబాద్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఓటరు జాబితా రూపొందించేందుకు అన్ని రాజకీయ పార్టీల నేతలు సహకరించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో బుధవారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నేతలతో ఓటరు జాబితాను సమీక్షించారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల పరిధిలో పోలింగ్ బూత్‌ల ఆధారంగా ఇంటింటి సర్వేను నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ సర్వే ద్వారా కుటుంబ సభ్యుల పేర్లను తీసుకోవడంతో పాటు బీఎల్‌వోల యాప్‌లో పరిశీలిస్తున్నామని అన్నారు. ఓటరు జాబితాను పక్కాగా రూపొందించేందుకు ఈ సర్వేను కొనసాగిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ఈ సర్వేకు అన్ని పార్టీల నేతలు సహకరించడంతో పాటు పోలింగ్ కేంద్రాల వారీగా ఏజెంట్లను నియమించాలన్నారు. ఎక్కడైనా ఇబ్బందులు ఉంటే ఆ పోలింగ్ స్టేషన్ ఆధారంగా తన దృష్టికి తీసుకురావాలన్నారు. వచ్చే అక్టోబరు 29న ఓటరు జాబితా డ్రాఫ్ట్ రోల్‌ను ప్రకటిస్తామని కలెక్టర్ అన్నారు. అది ప్రకటించిన తర్వాత నవంబర్ 18లోపు రెండు సార్లు బూత్‌స్థాయిలో స్పెషల్ కాంపేయిన్‌ను నిర్వహిస్తామన్నారు. ఎవరైనా దరఖాస్తు చేసుకుంటే పరిశీలిస్తామని ఆయన తెలిపారు. ప్రజాప్రతినిధులతో పాటు అందరి ఓటు హక్కులు ఉన్నాయో లేదో పరిశీలించుకోవాలని ఆయన కోరారు. జనవరి 1, 2025 నాటికి 18 సంవత్సరాలు నిండే యువతీ యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని వారికి రాజకీయ పార్టీల నేతలు సహకరించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో వివిధ పార్టీల నేతలతో పాటు అధికారులు పాల్గొన్నారు.



ఎస్సారెస్పీ ఐదు గేట్ల ఎత్తివేత

- ప్రాజెక్టులోకి 32వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- కాలువలకు కొనసాగుతున్న నీటి విడుదల

మెండోర, సెప్టెంబరు 11: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఐదు వరద గేట్ల ఎత్తి గోదావరిలోకి 15వేల 620క్యూసెక్కుల వరద నీటిని గోదావరిలోకి విడుదల చేస్తున్నట్లు ప్రాజెక్టు ఏఈఈ వంశీ తెలిపారు. ప్రాజెక్టులోకి సాయంత్రం 28వేల క్యూసెక్కులు వరద చేరగా ప్రాజెక్టు ప్రధానకాలువల ద్వారా నీటిని విడుదల చేశారు. రాత్రి ప్రాజెక్టులోకి 32వేల క్యూసెక్కుల వరద పెరగగా ఐదు వరద గేట్లను ఎత్తి గోదావరిలోకి నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో ప్రాజెక్టు నిండుకుండలా జలకళను సంతరించుకుంది. జూన్ 1వ తేదీ నుంచి ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి పరిసర ప్రాంతాల నుంచి భారీగా వరద చేరడంతో ప్రాజెక్టు నీటిమట్టం గరిష్ఠ స్థాయికి చేరుకుంది. దీంతో ప్రాజెక్టు నీటిమట్టం నిలకడగా ఉంది. శ్రీరాంసాగర్‌ప్రాజెక్టు వరద గేట్లను మంగళవారం రాత్రి మూసివేసి బుధవారం రాత్రి మరోసారి ఐదు గేట్లను ఎత్తి గోదావరిలోకి నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు 6వేల క్యూసెక్కులకు, ఎస్కేప్ గేట్ల ద్వారా 2వేల క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 684క్యూసెక్కులు, మిషన్ భగీరథ తాగునీటి కోసం 231వరద కాలువకు 15వేల క్యూసెక్కులు, లక్ష్మీకాలువకు 150క్యూసెక్కులు, నీటి విడుదల జరుగుతుందని తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091అడుగులు (80.5టీఎంసీ)లు కాగా బుధవారం సాయంత్రానికి 1091.00అడుగులు (80.501టీఎంసీ)ల నీటి నిల్వ ఉందని, గత ఏడాది ఇదే రోజు ప్రాజెక్టులోకి 1091.00అడుగులు (80.501టీఎంసీ)ల నీటి నిల్వ ఉందని తెలిపారు. జూన్ 1వ తేదీ నుంచి ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి 172టీఎంసీల నీరు వచ్చి చేరిందని ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువలకు 99టీఎంసీలు నీరు విడుదల చేయడం జరిగిందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు.



ఐదు రకాల చెట్లను ఉపయోగించి తయారు చేసిన కర్ర గణపతి



• కర్ర గణపతికి పూజలు చేస్తున్న భక్తులు

డొంకేశ్వర్‌లో కొలువుదీరిన కర్ర గణపతి

- విశేష పూజలందుకుంటున్న విఘ్నేశ్వరుడు
- జిల్లాలో ఎక్కడాలేని విధంగా కర్ర గణపతి ఏర్పాటు
- ఇతర జిల్లాల నుంచి భారీగా తరలి వస్తున్న భక్తులు

డొంకేశ్వర్, సెప్టెంబరు 11: జిల్లాలోని డొంకేశ్వర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కర్ర గణపతి విశేష పూజలందుకుంటున్నారు. ఏటా చవితి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. సాధారణంగా వినాయక ఉత్సవాల ముగింపు సందర్భంగా గణేష్ విగ్రహాలను నీటిలో నిమజ్జనం చేస్తుంటారు. కానీ అందుకు భిన్నంగా 11రోజుల విశేష పూజల తర్వాత లంబోదరుడిని ఊరేగించి ప్రత్యేక గదిలో భద్రంగా ఉంచడం ఇక్కడ అనవాయితీ. ఇక్కడ నెలకొల్పిన కర్ర (సత్య) గణపతిని పూజిస్తే రోగాలు రావని, మొక్కి ముడుపులు కడితే కోరికలు తీరుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. దీంతో ఏటా భక్తులు వేలల్లో దర్శించుకొని మొక్కులు చెల్లించుకుంటున్నారు.

ఊరంతా ఆధ్యాత్మికం..

వినాయక చవితి వస్తే ఊరూరా వినాయక మండపాలు కనిపిస్తాయి. కానీ డొంకేశ్వర్ మండల కేంద్రంలో మాత్రం అతి తక్కువ సంఖలో విగ్రహాలు ఏర్పాటు చేసినప్పటికీ సత్యగణపతి ప్రతిష్ఠించి ఐక్యతచాటుతూ ఆధ్మాత్మికత పంచుతున్నారు. 2018లో మొదటిసారిగా విగ్రహాన్ని తయారు చేయించాలని అనుకొన్నారు. నిర్మల్ జిల్లాలో సిద్దాపూర్ గ్రామానికి చెందిన జ్ఞానేశ్వర్ అనే కళాకారుడి వద్ద ఐదు రకాల కర్రలతో తయారు చేయించారు. ఉత్సవాల సమయంలో విగ్రహాన్ని రామాలయం నుంచి ఊరేగింపుగా తీసుకువచ్చి ప్రత్యేక పూజలు చేసి సత్యగంగవ్వ కళ్యాణ మండపంలో ప్రతిష్ఠించారు. పదకొండు రోజుల పాటు విశిష్ఠ పూజలు నిర్వహిస్తారు. మండపంలో ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు వచ్చి గణపతిని దర్శించుకుంటున్నారు. గ్రామస్థులంతా ప్రతీరోజు నిర్వహించే పూజా కార్యక్రమాల్లో పాల్గొంటారు. ప్రతీ సంవత్సరం 80మంది వరకు గణపతి దీక్షలను స్వీకరిస్తారు. అయితే ఏటా దీక్షలు స్వీకరించే వారి సంఖ్య పెరుగుతూ వస్తోంది. దీక్షాపరులతో పాటు కుంటుం బీకులంతా ఉదయం, సాయంత్రం పూజ కార్యక్రమానికి వచ్చి గణపతిని పూజిస్తారు. మధ్యాహ్న సమయంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు భజన కార్యక్రమాలు చేస్తారు. 11 రోజుల వేడుకలు ముగియగానే గ్రామంలోని సత్య గంగవ్వ కళ్యాణ మండపంలో బీరువలో కర్ర సత్య వినాయకుడిని గ్రామస్థులు భద్రపరుస్తారు.

పాలాజీ తరహాలో పూజలు..

: కల్లెం గంగారెడ్డి, డొంకేశ్వర్



మహారాష్ట్రలోని పాలాజీలో జరుగుతున్న పూజల తరహాలోనే ఇక్కడి కర్ర సత్య గణపతి కి పూజలు చేస్తాం. జిల్లాలో ఎక్కడాలేని విధంగా మా గ్రామంలో ఏర్పాటు చేస్తాం. సత్యగణపతికి ప్రతీరోజు యజ్ఞం, హోమం చేస్తాం. 11 రోజుల పాటు గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంటుంది. జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలివస్తున్నారు.



• హోమం చేస్తున్న భక్తులు



చెరువుల కబ్జాపై నజర్

- మండలాల వారీగా వివరాలను తీసుకుంటున్న అధికారులు
- చెరువుల కబ్జాలపై ప్రత్యేక డ్రైవ్‌ను చేపట్టనున్న యంత్రాంగం

నిజామాబాద్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలోని చెరువుల కబ్జాపై అధికార యంత్రాంగం నజర్ పెట్టింది. రెండేళ్ల క్రితం చెరువుల కబ్జాపై సేకరించిన వివరాల ఆధారంగా చర్యలకు సిద్ధం అవుతున్నారు. హైడ్రా తరహాలో జిల్లాలో కూడా ప్రత్యేక ఏర్పాట్లను చేసి కబ్జాలను అరికట్టాలని సీఎం ఆదేశించడంతో ముందస్తుగా సన్నాహాలు చేస్తున్నారు. మండలాల వారీగా వివరాలను పరిశీలించడంతో పాటు ఎన్ని చెరువులు కబ్జాలకు గురయ్యాయో పరిశీలించడంతో పాటు ఆ భూములను స్వాధీనం చేసుకునేందుకు సిద్ధమవుతున్నారు. సాగునీటి శాఖ, రెవెన్యూ, సర్వే లాండ్ రికార్డ్స్, పోలీస్, టౌన్‌ప్లానింగ్, పంచాయతీ శాఖలతో పాటు ఇతర శాఖల ఆధ్వ ర్యంలో చర్యలు చేపట్టనున్నారు. శిఖం భూములతో పాటు చెరువులను కబ్జా చేసి నిర్మాణమైన కట్ట డాలను కూడా కూ ల్చేందుకు సన్నద్ధమవుతున్నారు. పూర్తిస్థాయిలో పరిశీలించిన మీదట చర్యలు చేపట్ట నుండటంతో కబ్జాదారుల్లో ఆందోళన మొదలైంది.

1086 చెరువులు..

జిల్లాలో 1086 చెరువులు ఉన్నాయి. వీటి పరిధిలో వేల ఎకరాల భూములు సాగు అవుతున్నాయి. ప్రతియేడు చెరువుల నుంచి సాగునీరు ఆయకట్టుకు అందుతోంది. ఈ చెరువుల పరిధిలో ప్రభుత్వానికి సంబంధించిన భూములు ఉన్నాయి. వీటిలో శిఖం భూములతో పాటు రిజర్వాయర్‌లో ఉన్న భూములు ఉన్నాయి. వీటి పరిధిలో కొంత మంది గ్రామస్థులకు పట్టాలు కూడా కొన్ని ఎకరాలకు ఉన్నాయి. భూముల ధరలు పెరగడం మున్సిపాలిటీల పరిధిలో నిర్మాణాలు ఎక్కువగా కావడం వల్ల భూములు ఎక్కువగా కబ్జాకు గురవుతున్నాయి. నిజామాబాద్ నగర కార్పొరేషన్‌తో పాటు బోధన్, ఆర్మూర్, భీంగల్ మున్సిపాలిటీలతో పాటు ప్రధాన మండలాల పరిధిలోని భూములు ఎక్కువగా కబ్జాలో గురయ్యాయి. ఆయా మండలాల పరిధిలో డిమాండ్‌ను బట్టి చెరువు శిఖం భూములు, రిజర్వాయర్ భూములు గత కొన్నేళ్లుగా కబ్జాలపాలయ్యాయి. ప్రాజెక్టులతో పాటు చెరువుల కాల్వలను కూడా కబ్జాలు చేశారు. నిజాంసాగర్‌కు సంబంధించిన చాలా కాలువలు కబ్జాలకు గురికావడంతో పాటు ఇండ్ల నిర్మాణాలు కూడా చేశారు. నిజామాబాద్ నగర కార్పొరేషన్ పరిధిలో నిజాంసాగర్ కాలువ ఆనవాళ్లను కూడా కోల్పోయింది. ఆర్మూర్ మున్సిపాలిటీలో కూడా కాలువను కబ్జా చేశారు. కాలువ వెంబడి ఈ రెండు మున్సిపాలిటీల పరిధిలో నిర్మాణాలు చేశారు.

జిల్లాలోనూ 'హైడ్రా' తరహా.

హైదరాబాద్ నగర కార్పొరేషన్‌లో ఏర్పాటు చేసిన హైడ్రా తరహాలో జిల్లాలో కూడా ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. కలెక్టర్ల ఆధ్వర్యంలో ప్రత్యేక వింగ్‌ను ఏర్పాటు చేసి అక్రమ నిర్మాణాలు, కబ్జాలపై చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. దీంతో జిల్లా అధికారులు ప్రస్తుతం ఈ చెరువుల కబ్జాపై ఆరా తీస్తున్నారు. నిజామాబాద్ నగరంతో పాటు బోధన్, భీంగల్, ఆర్మూర్ మున్సిపాలిటీలతో పాటు మండల కేంద్రాల వారిగా వివరాలను సేకరిస్తున్నారు. గతంలో జరిగిన సర్వే ఆధారంగా కబ్జా వివరాలను తీసుకోవడంతో పాటు కొత్తగా ఏమైన కబ్జాలు జరిగాయో పరిశీలిస్తున్నారు. అన్ని చెరువుల వివరాలను తీసుకోవడంతో పాటు ప్రధానంగా నగర కార్పొరేషన్‌తో పాటు మున్సిపాలిటీలో మొదట చర్యలు చేపట్టి తర్వాత మండల స్థాయిలో కూడా చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతున్నారు. ప్రభుత్వం నుంచి విధి విధానాలు వెలువడగానే ప్రత్యేక వింగ్‌ను ఏర్పాటు చేసి చర్యలు చేపట్టనున్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

జక్రాన్‌పల్లి, సెప్టెంబర్11: నిజామాబాద్‌రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి సమక్షంలో మండలంలోని తొర్లికొండ గ్రామ బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు ఆర్.శేఖర్‌గౌడ్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. బుధవారం శేఖర్‌గౌడ్, జీవన్‌గౌడ్‌లకు ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి కాంగ్రెస్ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, బ్రహ్మణ్‌పల్లి సింగిల్‌విండో చైర్మన్ కాట్‌పల్లి నర్సారెడ్డి, కాంగ్రెస్ నాయకులు గడ్డం గంగారెడ్డి, కట్కరవి, తాజుద్దీన్, వినోద్, రాజేష్‌గౌడ్, కాట్‌పల్లి సాయిరెడ్డి, రాజేశ్వర్, మల్లేష్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

గణేష్ మండపాల వద్ద అన్నదానం

బోధన్‌రూరల్, సెప్టెంబర్ 11: బోధన్ పట్టణంతో పాటు సాలూర, బోధన్ మండలాల్లో, పట్టణంలోని పలు వార్డులలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వినాయకుడిని మండపాల కూర్చోబెట్టి ఐదురోజులు కావస్తున్న సందర్భంగా అన్నదానాలు ప్రారంభమయ్యాయి. పట్టణంలోని హనుమాన్ టెకిడి, ఎల్‌బీఎస్ నగర్‌లో గల బాల గణేష్‌మండలి వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో కూర శ్రీనివాస్, నర్సన్న, ధర్మ, బాల గణేష్ మండలి బాధ్యులు నీతేష్, సాత్విక్, సుమిత్, సకేత్, నెహాన్ రాజ్, వర్ధన్, చరణ్, సారధి, సాయి, రోహిత్, కరణ్, అమిత్, ధనుష్, తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనానికి నాలుగు పాయింట్ల ఏర్పాటు

ఆర్మూర్‌టౌన్, సెప్టెంబర్11: మున్సిపల్ పరిధిలోని గణేష్ నిమజ్జనానికి నాలుగు పాయింట్‌లను ఏర్పాటు చేసినట్టు ఆర్డీవో రాజాగౌడ్ తెలిపారు. 17న గణేష్ నిమజ్జనోత్సవం ఉండడంతో బుధవారం పట్టణంలోని గూండ్ల చెరువు, పెర్కిట్ చెరువు, కొటార్మూర్ పెద్ద చెరువు, మామిడిపల్లి చెరువుల్లో గణపతి నిమజ్జనం చేసేందుకు పాయింట్‌లను ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు.

భీమ్‌గల్‌లో మహాలడ్డు ఊరేగింపు

భీమ్‌గల్, సెప్టెంబరు 11: పట్టణ కేంద్రంలోని ఎర్రోడి గల్లీ గణేష్ మండలి ఆధ్వర్యంలో బుధవారం గణపతి మహాలడ్డును ఊరేగింపు నిర్వహించారు. యూత్ సభ్యులు వంశీకృష్ణ, నర్సయ్య, రాజు, రామ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు కృషి

● బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

బోధన్‌రూరల్, సెప్టెంబర్ 11: బోధన్ నియోజకవర్గంలోని మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా మహిళ సాధికారితకు కృషి చేస్తున్నట్లు బోధన ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. బుధవారం బోధన్ మండలంలోని పెంటాఖుర్దు గ్రామ స్వయం సంఘాలకు ఎల్ఈడీటీ కింద అలీప్ సంస్థ ట్రైనింగ్ కార్యక్రమం నిర్వహించింది. కార్యక్రమంలో భాగంగా బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి మహిళలతో కలిసి అలీప్ సందర్శించి ఫుడ్ ప్రాసెసింగ్‌కు సంబంధించి వివరాలు, నిర్వహణ వంటి విషయాలు సంస్థ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. మూడు దశాబ్దాలుగా ఎంతోమంది మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు వ్యాపార వేత్తలను ప్రోత్సహించి వారిని ఉన్నతస్థాయిలో నిలబెట్టిన ఘనత అలీప్‌దేనని, దానికి బాధ్యులైన రమాదేవిని ప్రశంసించారు. అలాగే కార్‌నోప్లెక్స్ పరిశ్రమను అభివృద్ధి చేయుటకు బోధన్ నియోజకవర్గం అనువైనదని అలీప్‌కు కావాల్సిన స్థలం ఇతర సదుపాయలు సమకూర్చినట్లయితే పరిశ్రమను నెలకొల్పి స్వయం సహాయక సంఘాల ద్వారా ఎంతోమంది మహిళలకు ఉపాధి కల్పించవచ్చని రమాదేవి సూచించారు. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్ని రకాలుగా ప్రోత్సహిస్తామని భరోసా కల్పించారు. అలీప్ ఆవరణలోని బయోడిగ్రేడబుల్ ఉత్పత్తులు జీరో వెస్ట్ మేనేజ్‌మెంట్ సాక్స్, క్లస్టర్, చిరుధాన్యాలు, తృణధాన్య ఉత్పత్తులను పరిశీలించారు.

పడిగెల పీఏసీఎస్ అక్రమాలపై విచారణ



ప్రత్యేక అధికారి మురళికి ఫిర్యాదు చేస్తున్న రైతులు

వేల్పూర్, సెప్టెంబరు 11 : మండలంలోని పడిగెల పీఏసీఎస్‌లో రైతుల పేరుతో అక్రమంగా రుణాలు తీసుకున్న ఘటనపై సహకార శాఖ ప్రత్యేక అధికారి మురళి గురువారం విచారణ చేశారు. పడిగెల పీఏసీఎస్‌లో గతంలో పనిచేసిన సిబ్బంది రైతులకు తెలియకుండానే వారి పేర్లపై రుణాలు తీసుకున్నారని, రైతులు చేసిన ఫిర్యాదు మేరకు గురువారం మురళి వచ్చి విచారణ చేశారు. నివేదికను జిల్లా సహకార శాఖ అధికారికి నివేదిస్తానని మురళి చెప్పారు.

బషీరాబాద్ ఉన్నత పాఠశాలకు కుర్చీల వితరణ

కమ్మర్‌పల్లి, సెప్టెంబరు 11: మండలంలోని బషీరాబాద్ ఉన్నతపాఠశాలలో పనిచేస్తూ ఇటీవలే బదిలీ పైవెళ్లిన ఇద్దరు ఉపాధ్యాయులు తమవంతుగా పాఠశాలకు 10 కుర్చీలను వితరణ చేశారు. పాఠశాల నుంచి బదిలీపై వెళ్లిన స్కూల్‌అసిస్టెంట్ తెలుగు తూర్పాటి ఆనంద్, ఎస్ఏ హిందీ మమత తమవంతుగా పాఠశాలకు కుర్చీలతో పాటు పాఠశాల అభివృద్ధి నిమిత్తం తమవంతుగా రూ.5 వేల నగదును పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంగాధర్‌కు అందజేశారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

రెంజల్,సెప్టెంబర్ 11: మండలంలోని సాటాపూర్ గ్రామానికి చెందిన సాలూరు సాయిలుకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా 58వేల మంజూరైన చెక్కును బుధవారం టీపీసీ మండల అధ్యక్షుడు నితిన్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడగా బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు చేశారన్నారు. ఎమ్మెల్యేకు రుణపడి ఉంటామన్నారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ సాయిలు, వడ్ల శంకర్, ప్రేమ్‌కుమార్, సాయిలు, గంగాధర్, గంగారాం, రాజు, భూమేష్, అనిల్, గోవింద్, సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ జట్టుకు మోర్తాడ్‌లో శిక్షణ

మోర్తాడ్, సెప్టెంబరు 11: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉమ్మడి జిల్లా సబ్‌జూనియర్ బాలికల బాల్‌బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఎస్సై బి.విక్రం శిక్షణను ప్రారంభించారు. ఈనెల 14నుంచి 15వ తేదీ వరకు సికింద్రాబాద్‌లోని రమ్యా గ్రౌండ్స్ కూకట్‌పల్లిలో 43వ రాష్ట్రస్థాయి జూనియర్ బాలబాలికల బాల్ బ్యాడ్మింటన్ పోటీలు జరుగుతాయని కోచ్‌శ్యామ్ తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ఎంపికైన జట్టుకు శిక్షణ నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్య క్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్ ముఖ్యఅతిథిగా ఎస్సై విక్రం పాల్గొన్నారు. జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ సంఘం ప్రధాన కార్యదర్శి శ్యామ్, ఉపాధ్యాయులు రవీందర్, రవి, వినయ్, సాగర్, రాము, దీపిక, పద్మ, భూలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించిన కలెక్టర్

ఆర్మూర్‌రూరల్, సెప్టెంబరు 11: ఇటీవల ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం పొందిన ఆలూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరేందర్‌ను బుధవారం కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అంకితభావంతో పనిచేసినప్పుడే ఉపాధ్యాయులకు గుర్తింపు లభిస్తుందన్నారు. అవార్డులు బాధ్యతలను మరింత పెంచుతాయన్నారు.

వరద బాధితులకు ఆర్థిక సహాయం

ఆర్మూర్‌రూరల్, సెప్టెంబరు 11: ఇటీవల రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన వరద బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వానికి తమవంతు సహాయంగా ఆర్మూర్ జర్నలిస్టు కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు బుధవారం రూ.11వేల డీడీ చెక్కును ఆర్డీవో రాజాగౌడ్‌కు అందజేశారు. భారీవర్షాలతో నష్టపోయిన వారికి అండగా నిలిచేందుకు తమవంతుగా ఆర్థికసహాయం అందజేస్తున్నామని కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు సుంకె శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు కొక్కెర భూమన్న తెలిపారు. కార్యక్రమంలో సత్యనారాయణగౌడ్, కొంతం రాజు ఉన్నారు.

ముప్కాల్ : ఇటీవల కురిసిన భారీవర్షాల కారణంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో నష్టపోయిన బాధితులకు ఆపన్నహస్తంగా సీఎం సహాయనిధికి బుధవారం ముప్కాల్ మండల కేంద్రానికి చెందిన రేసింగ్‌బాయ్ యూత్ అసోసియేషన్ ద్వారా రూ.10వేల ఆర్థిక సహాయాన్ని పంపారు. తెలంగాణ రాష్ట్రానికి రూ.5వేలు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రూ.5వేల చొప్పున వరద బాధితులకు కోసం సీఎం సహాయనిధికి పంపినట్లు రేసింగ్‌బాయ్స్ యూత్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు.

పింఛన్ రావడం లేదని నిలదీత

ఎడపల్లి, సెప్టెంబర్ 11: వివరాల నమోదులో తప్పిదం వల్ల ఓ లబ్ధిదారురాలికి పింఛన్ ఆగిపోయింది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పోచారం గ్రామానికి చెందిన వృద్ధాప్య పింఛన్‌దారుడు తాడెం గంగారాం గత సంవత్సరం అక్టోబరులో మరణించాడు. దీంతో అతని భార్య తాడెం సాయమ్మ తన భర్త మరణించినందున వృద్ధాప్య పింఛన్‌ను, వితంతు పింఛన్‌గా మార్చి తనకు ఇవ్వాలని ఫిబ్రవరి నెలలో ఎడపల్లి మండల పరిషత్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు చేసుకుని ఎనిమిది నెలలు కావస్తున్నా ఆమెకు పింఛన్ అందలేదు. దీంతో ఆమె కుమారుడు తాడెం ఇస్తారీ మండల కార్యాలయానికి వచ్చి మండల అభివృద్ధి అధికారిని పదినెలలుగా ఎందుకు రావడం లేదని నిలదీశాడు. దీంతో ఎంపీడీవో శంకర్ కార్యాలయంలోని కంప్యూటర్ ఆపరేటర్‌ను పిలిపించి విచారించాడు. కాగా అధికారుల తప్పిదం వల్లే తన తల్లికి పింఛన్ రాలేదని, ఇలాంటివి మరలా పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన రుద్రూరు నాయకులు

రుద్రూరు, సెప్టెంబరు 11 : రుద్రూరు మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు బుధవారం హైదరాబాద్‌కు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ బాలరాజ్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసి అభినందనలు తెలిపారు. అదేవిధంగా నిజామాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణా రావును కలిసి సన్మానించారు. కలిసిన వారిలో రుద్రూరు మండల అధ్య క్షులు తోట అరుణ్‌కుమార్, ఉపాధ్యక్షులు నడిపింటి నగేష్, మండల నాయకులు మాశెట్టి శ్రీను, కొండలవాడి శంకర్ తదితరులున్నారు.

కేరీర్ గైడెన్స్‌పై విద్యార్థులకు అవగాహన

ఆర్మూర్‌టౌన్, సెప్టెంబర్ 11: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రసాయనశాస్త్ర విభాగం, కేరీర్ గైడెన్స్ సెల్ సహ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు కేరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ వై.వేణుప్రసాద్, తెలంగాణ యూనివర్సిటీ బోర్డ్ ఆఫ్ స్టడీస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ కెమిస్ట్రీ చైర్‌పర్సన్ జి.బాలకృష్ణలు మాట్లాడుతూ విద్యార్థులు తమ లక్ష్యాన్ని నిర్దేశించుకొని చక్కని ప్రణాళిక, పట్టుదలతో ముందుకు వెళ్తే లక్ష్యం సాధించడం సులభమవుతుందని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎన్.సునీత, డాక్టర్ జి.లింగన్న, జాన్ సుకుమార్, అంబార్‌సింగ్, శ్యామ్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న చైర్‌పర్సన్

నిమజ్జనాన్ని ప్రశాంతంగా జరుపుకోవాలి

● సబ్‌కలెక్టర్ వికాస్ మహతో

బోధన్‌రూరల్, సెప్టెంబర్ 11: వినాయక నిమజ్జనాన్ని ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలనిబోధన్ సబ్‌కలెక్టర్ వికాస్ మహతో అన్నారు. బుధవారం బోధన్ పట్టణంలోని వినాయక నిమజ్జన రూట్‌మ్యాప్‌ను బోధన్ ఏసీపీ, మున్సిపల్ చైచైచ,రర్‌పర్సన్ తూము పద్మశరత్ రెడ్డితో కలిసి పరిశీలించారు. రాకాసిపేటలోని రైల్వేగేట్ సమీపంలోని జూనియర్ కళాశాల మైదానంలో ఉన్న గణేష్‌ల బావిని పరిశీలించారు. అనంతరం పసుపు వాగులో నిమజ్జన ప్రదేశాన్ని సైతం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణేష్ పండుగ అనంతరం నిమజ్జనానికి చేపట్టాల్సిన ఏర్పాట్లపై సంబంధిత శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గణేష్ నిమజ్జనం కోసం అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలన్నారు. సంబంధిత అధికారులు సెలవులు పెట్టకుండా అందుబాటులో ఉండాలన్నారు. ప్రజలు గణేష్ నిమజ్జన శోభాయాత్రను ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు.



బావిని పరిశీలిస్తున్న దృశ్యం

తొమ్మిది రోజుల పాటు రాకాసిపేటలో పూజలు నిర్వహిస్తున్న గణనాథులను ఆదివారం పసుపువాగులో నిమజ్జనం చేయడం ఆనవాయితీగా వస్తుందన్నారు. అలాగే శక్కర్‌నగర్‌లోని వినాయకులను తొమ్మిది రోజుల పాటు పూజించి శక్కర్‌నగర్‌లోని గణేష్ బావిలో నిమజ్జనం చేస్తారన్నారు. ప్రజలు గణేష్ నిమజ్జన శోభాయాత్రను సమన్వయంతో ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటనారాయణ, తహసీల్దార్ విఠల్, పట్టణ సీఐ వెంకటనారాయణ, రూరల్ సీఐ కోలా నరేష్, మున్సిపల్ ఏఈ శ్రీనివాస్, అధికారులు తదితరులున్నారు.

ముప్కాల్ : బాల్కొండ మండల కేంద్రంలో పెద్దచెరువులో గణేష్ నిమజ్జనోత్సవం ఏర్పాట్లను బుధవారం ఎస్సై బి.నరేష్, పంచాయతీకార్యదర్శి రజనీకాంత్‌రెడ్డి, విద్యుత్ అధికారులతో కలిసి సీఐ శ్రీధర్ పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీధర్ మాట్లాడుతూ రోడ్లకు ఇరువైపుల అడ్డంగా ఉన్న చెట్లకొమ్మలను తొలగించి తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ వైరు తీగలను బిగించాలని సూచించారు.

మాక్లూర్ : మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు బుధవారం మండలంలోని బోర్గం(కె) గ్రామ చెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్లను అధికారులు, నిర్వాహకులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో పొద్దుటూరి టవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమమహేశ్వర్‌రెడ్డి, నిజామామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ ఈఈ, ఏఈ, వర్కి ఇన్స్‌పెక్టర్, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు రాకుండా చర్యలు చేపట్టాలి

● ఎంపీడీవో రాజా శ్రీనివాస్

కమ్మర్‌పల్లి, సెప్టెంబరు 11: వర్షాకాలంలో వ్యాపించే సీజనల్ వ్యాదులు ప్రబలకుండ ముందస్తు చర్యలు చేపట్టాలని కమ్మర్‌పల్లి ఎంపీడీవో రాజా శ్రీనివాస్ అన్నారు. బుధవారం కమ్మర్‌పల్లి మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఆయన సందర్శించి పరిసరాలను పరిశీలించారు. ఆసుపత్రి పరిధి గ్రామాల వివరాలను తెలుసుకుని సీజనల్ వ్యాదులు రాకుండా చేపడుతున్న చర్యలను స్థానిక ఆసుపత్రి వైద్యులు డాక్టర్ నర్సింహాచారిని అడిగి తెలుసుకున్నారు. గ్రామాలలో ఆరోగ్య ఉపకేంద్రాల ద్వారా అందిస్తున్న ఆరోగ్యసేవలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆదేశించారు. అనంతరం కమ్మర్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రి పరిసరాలను పరిశీలించి వర్షపు నీరు నిలువ ఉన్నందున నీరు ఆగకుండా చూసుకోవాలని ఆదేశిస్తూ నిలువ నీటిపై బ్లీచింగ్, అయిల్ బాల్స్ వేయించారు. అనంతరం ఆసుపత్రి రికార్డులను ఆయన పరిశీలించారు. అక్కడున్న వైద్య సిబ్బందితో మాట్లాడుతు ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన సేవలందించాలని అదేశించారు. మందులస్టాక్‌ను ఆడిగి తెలుసుకున్నారు.

సాయుధ పోరాట చరిత్ర కమ్యూనిస్టులదే

కోటగిరి,సెప్టెంబర్ 11: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్ర కమ్యూనిస్టులదేనని సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ పేర్కొన్నారు. కోటగిరి మండల కేంద్రంలో సీపీఐ ఆధ్వర్యంలో బుధవారం తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట 76వ వార్షికోత్సవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ మాట్లాడుతూ నైజంపాలనకు వ్యతిరేకగా భూమి, భుక్తి, మాతృభూమి విముక్తి కోసం జరిగిన పోరాటంలో 4వేల మంది సీపీఐ కార్యకర్తలతో పాటు మరెందరో ప్రజలు ప్రాణాలు కోల్పోయ్యారన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఓమయ్య, నియోజకవర్గ ఇన్‌చార్జి రాములు, మండల కార్యదర్శి విఠల్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్‌ల పంపిణీ

రెంజల్, సెప్టెంబర్ 11: మండలంలోని నీలా ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహించిన రజిత 2015లో రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో ఆమె జ్ఞాపకార్థం భర్త విజయ్ ప్రతిసంవత్సరం విద్యార్థులకు నోట్‌బుక్, పెన్నులు, పలకలు పంపిణీ చేయడం జరుగుతుందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు శంకర్ అన్నారు. 2016 నుంచి ప్రతి సంవత్సరం విద్యార్థులకు నోట్‌బుక్‌లను అందించడం జరుగుతుందని వారన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీరాం, ప్రవీణ్, జలేందర్ గౌడ్, లింగన్న, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

సాహిత్యంలో ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులు



ప్రశంసా పత్రాలు పొందిన విద్యార్థులు

ఏర్గట్ల, సెప్టెంబరు 11: పత్తిపాక ఫౌండేషన్ అలాగే గరిపెల్లి ట్రస్ట్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో ఎన్నుకోబడిన 30 పాఠశాలల్లో సాహిత్య కార్యశాలలో భాగంగా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు రాసిన కథలకు గాను ప్రశంసాపత్రాలను బుధవారం యాభై మంది విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు కృష్ణచారి అందజేశారు. కార్యక్రమంలో తెలుగ పండితులు ప్రవీణ్ శకర్మ, ఉపా ధ్యాయులు రాజశేఖర్, శ్రీనివాస్, పవన్, విజయ, విద్యార్థులు పాల్గొన్నారు.

భారత్ జట్టు సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు



విద్యార్థినులను సన్మానించిన కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకురాలు

ఆర్మూర్‌టౌన్, సెప్టెంబర్ 11: ఏషియన్ యూనివర్సిటీ సాఫ్ట్‌బాల్ పోటీలకు తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు అజ్మీర ఇందు, లకావత్ రాణిలు భారత జట్టు తరపున ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రిక తెలిపారు. తైవాన్ దేశంలో తైచుంగ్‌లో జరుగనున్న నాల్గో ఏషియన్ యూనివర్సిటీ ఉమెన్స్ సాఫ్ట్‌బాల్ ఏషియకప్ - 2024 పోటీలు అక్టోబర్ 15 నుంచి 19వ తేదీ వరకు జరుగనున్నాయని, పోటీలలో కళాశాలకు చెందిన విద్యార్థులు ఎంపిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రిక పట్టుశాలువ, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

సినీ ఫక్కీలో 1.96 లక్షల నగదు చోరీ

నవీపేట, సెప్టెంబర్ 11: మండలంలోని జన్నేపల్లిలో బుధవారం దెబ్బ చిన్న చిన్నయ్య అనే గొరైల కాపరికి చెందిన 1.96లక్షల రూపాయల నగదును గుర్తుతెలియని దుండగులు లాక్కెళ్లారు. ఎస్ఐ వినయ్ తెలిపిన తెలిపిన ప్రకారం.. మాక్లూర్ మండలం అల్వాపూర్‌కు చెందిన చిన్న చిన్నయ్య తన భార్య గంగామణితో కలిసి జన్నేపల్లి కెనరా బ్యాంకుకు వచ్చారు. మధ్యాహ్నం 12గంటల సమయంలో బ్యాంకులో ఉన్న 1.96లక్షల నగదును డ్రా చేసుకుని ఒక కవర్‌లో పెట్టుకున్నారు. అదే కవర్‌లో పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డులు, బ్యాంకు ఖాతా బుక్కులను కూడా అందులో ఉంచారు. నగదు ఉన్న కవర్‌ను గంగామణి చేతిలో పట్టుకుని బైక్ వెనుక కూర్చొగా చిన్న చిన్నయ్య బైక్ నడుపుతూ తమ స్వగ్రామానికి బయల్దేరారు. బ్యాంకు దాటిన కొద్ది దూరం తర్వాత గుర్తు తెలియని దుండగుడు హెల్మెట్ పెట్టుకుని స్కూటి వాహనంతో బైక్‌ను వెంబడించి గంగామణి చేతిలో ఉన్న నగదు కవర్‌ను లాక్కెళ్లి పారిపోయాడు. దుండగుడి కోసం సమీపంలో గాలించినప్పటికీ నిందితుడు పరారీ అయ్యాడు. బాధితుడు దెబ్బ చిన్న చిన్నయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ కాపర్ వైర్ల చోరీ

బోధన్‌రూరల్, సెప్టెంబర్ 11: బోధన్ మండలంలోని సాలూర, పెంటా ఖుర్దు గ్రామాల్లోని పంట పొలాల్లో రెండు ట్రాన్స్‌ఫార్మర్ల కాపర్‌వైర్‌లను గుర్తు తెలియని దుండగులు దొంగిలించినట్లు రూరల్ ఎస్ఐ మచ్చేందర్ రెడ్డి తెలిపారు. పంట పొలాల్లోని ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ వైర్‌లను చోరీ చేయడం జరిగిందని, ఆయా పంట పొలాల రైతులు, ట్రాన్స్‌కో ఏఈ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామన్నారు. సీసీ ఫుటేజీ అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టి దొంగలను పట్టుకుంటామన్నారు.

పాము కాటుకు వ్యక్తి మృతి

ఎడపల్లి, సెప్టెంబర్ 11: ఎడపల్లి మండల కేంద్రానికి చెందిన వ్యక్తి పాముకాటుకు గురై మరణించినట్లు స్థానికులు తెలిపారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన దువ్వ నారాయణ (61) అనే వ్యక్తి పాముకాటుకు గురి కావడంతో గమనించిన స్థానికులు వెంటనే నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మరణించినట్లు వైద్యులు తెలిపినట్లు స్థానికులు, కుటుంబసభ్యులు తెలిపారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

ఆర్మూర్‌రూరల్, సెప్టెంబరు11: విద్యార్థులు క్రీడల్లో నైపుణ్యం ప్రదర్శించి పట్టుదలతో ఆడి రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణించాలని ఆలూర్ సొసైటీ చైర్మన్ తంబురి శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఆర్మూర్ మండలం ఇస్సాపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇటీవల మండల స్థాయి క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అభినందన సభ ఏర్పాటు చేసి మెమోంటోలను అందజేసి సన్మానించారు. పాఠశాల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి రాజగంగారాం, స్థానిక నాయకులు డీసీ.ముత్తెన్న, ఉపాధ్యాయులు జగదీష్, శ్రీనివాస్, కృష్ణరెడ్డి, చిన్నయ్య, లింబాద్రి, రాము, అర్పిత, అరుంధతిలు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న సొసైటీ చైర్మన్ తంబురి శ్రీనివాస్

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

● పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షులు మోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షులు

నవీపేట, సెప్టెంబర్ 11: ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షులు మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో శిక్షణ పొందిన ఉపాధ్యాయులతో విద్యాబోధన చేయడం జరుగుతుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి సముచిత ప్రాధాన్యత ఇవ్వడం పట్ల ఆయన కృతజ్ఞత తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తూ మండల ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 30 మందికి పూలమాలలు, శాలువా, మెమోంటోలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంఈవో గణేష్ రావు, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు భూమయ్య, శివకుమార్, హన్మారెడ్డి, జేదీద్య, గోవర్ధన్, మహిళాళళళరళళల ఉపాధ్యాయ సంఘం అధ్యక్షురాలు రాధ, భూంరెడ్డి, గోపాల్‌రెడ్డి, వివిధ ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కల్లూర్‌లో ఇంటి వేలం

కోటగిరి,సెప్టెంబర్ 11 : పొతంగల్ మండలంలోని కల్లూర్ గ్రామంలో కెనరా బ్యాంక్ సీఎస్‌పీ సెంటర్ నిర్వాహకురాలు సంధ్య ఇంటికి బుధవారం గ్రామస్థులు వేలం నిర్వహించారు. నెలరోజుల క్రితం గ్రామంలోని మహిళ సంఘాల డబ్బులు సుమారు 45లక్షలు సీఎస్‌పీ నిర్వాహకురాలు కాజేసింది. దీంతో మహిళ సంఘాల సభ్యులు, గ్రామస్థులు ఆందోళనకు దిగి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. నెల రోజులు గడువు ఇచ్చిన డబ్బులు చెల్లించడంలో సీఎస్‌పీ సెంటర్ నిర్వాహకురాలు నిర్లక్ష్యం చేయడంతో మహిళ సంఘాల సభ్యులు ఇంటికి వెళ్లి నిలదీశారు. ఇంటిని గ్రామస్థుల సమక్షంలో వేలం వేయించారు. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి సుమారు15లక్షల రూపాయలకు వేలంలో ఇంటివని దక్కించుకున్నారు. నెల రోజుల్లోగా 15లక్షల రూపాయలు చెల్లిస్తానని వేలంలో ఇంటిని దక్కించుకున్న వ్యక్తి స్పష్టం చేశాడు. ఇప్పటికే సీఎస్‌పీ సెంటర్ నిర్వాహకురాలు 6లక్షల రూపాయలు జమ చేసింది. ఇంటికి వేలం నిర్వహించడంతో మరో 15లక్షల రూపాయలు రికవరీ అవుతుందని మహిళ సంఘాల సభ్యులు భావిస్తున్నారు. మరో 23 లక్షలు చెల్లించి సమస్యను పరిష్కరించాలని మహిళలు కోరుతున్నారు.



సీఎస్‌పీ సెంటర్ నిర్వాహకురాలిని నిలదీస్తున్న దృశ్యం

వినాయకుడికి పూజలు నిర్వహించిన టీయూ రిజిస్ట్రార్



టీయూ హస్టల్ లో పూజలు చేస్తున్న రిజిస్ట్రార్ యాదగిరి

డిచ్‌పల్లి, సెప్టెంబరు 11 తెలంగాణ వర్సిటీ ఓల్డ్ హాస్టల్‌లో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహానికి టీయూ రిజిస్ట్రార్ యాదగిరి బుధవారం ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఆడిట్ సెల్‌డైరెక్టర్ ఘంట చంద్రశేఖర్, చీఫ్ వార్డెన్ మహేందర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను కాపాడాలని తహసీల్దార్‌కు వినతి

భీమ్‌గల్, సెప్టెంబరు 11 : ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలను కబ్జాల నుంచి కాపాడాలని బుధవారం భీమ్‌గల్ మండలం కుప్కాల్ గ్రామానికి చెందిన దేవ్‌సింగ్ తహసీల్దార్ మహమ్మద్ షబ్బీర్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ భూములు, చెరువులు, గుంటలు ఇందిరమ్మ ప్లాట్లను కొందరు కబ్జాలు చేస్తున్నారని, వాటిని వెంటనే అరికట్టాలని తహసీల్దార్‌ను కోరారు. హైదరాబాద్‌లో చేపడుతున్న హైడ్రా మాదిరి భీమ్‌గల్ మండలంలో కూడా చేపట్టి మొదట కుప్కల్ నుంచి ప్రారంభించాలని ఆయన తహసీల్దార్‌ను కోరారు.

బాధితులకు ఆర్థిక సహాయం

మోర్తాడ్, సెప్టెంబరు 11: మండలంలోని దొన్కల్ గ్రామానికి దర్మగాండ్ల సాయి భార్య కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులకు ముత్యాల సునీల్‌కుమార్ రూ.5000 ఆర్థిక సహాయం పంపించారు. బుధవారం మండలంలోని దొన్కల్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గడ్డం అనిల్ రూ.5వేలను కుటుంబసభ్యులకు అందజేశారు. ఈ సం దర్భం గా సునీల్‌కుమార్‌కు బాధిత కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలి పా రు. కార్యక్రమంలో గడ్డం అనిల్, అరుణ్, మల్లికార్జున్, ముత్యం, కల్లెం రవి, చింతకింది రవి, తుమ్మల వినోద్, బాస మహేందర్, శ్యామ్, బంజార శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను పరామర్శించిన మానాల

మోర్తాడ్, సెప్టెంబరు 11: మండలంలోని ధర్మోరా గ్రామాన్ని బాధిత కుటుంబాలను బుధవారం రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి పరామర్శించారు. గ్రామానికి చెందిన ముస్కు భూమారెడ్డి, మరణించడంతో ఆయన కుమారులు రాజేందర్ రెడ్డి కుటుంబసభ్యులను పరామర్శించారు. అంతేగాక మోర్తాడ్‌లో ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు నీరజ్ తండ్రి అనారోగ్యంతో ఉండడంతో వారి ఇంటికి వెళ్ళి ఆరోగ్య విషయాలను అడిగితెలుసుకున్నారు. ఆయన వెంట మాజీఎంపీపీ గిర్మాజీ గంగాధర్, మాజీఉపసర్పంచ్ సొక్కా యి గంగారెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పుప్పాల అశోక్, మహి పాల్, గిర్మాజీ గోపి, భూమారెడ్డి, రవి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలో రిటైర్డు ఉపాధ్యాయుడు రాందాస్ కుటుంబసభ్యులను రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి పరామర్శించారు. విశ్రాంత ఉపాధ్యాయుడు రాందాస్, ఇటీవల మృతిచెందడంతో ఆయన కుమారుడు సీఐ రాజశేఖర్‌ను మానాల మోహన్‌రెడ్డి పరామర్శించారు.

కమ్మర్‌పల్లి:మండలంలోని నర్సాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్తలు ఆర్ఎంపీ వైద్యుడు జనార్థన్, ఇప్ప గంగాధర్‌లు ఇటీవల అనారోగ్యంతో మరణించగా బుధవారం స్వగ్రామం నర్సాపూర్‌లో వారి కుటుంబసభ్యులను జిల్లా కాంగ్రెస్ అధ్య క్షుడు మానాల మోహన్‌రెడ్డి పరామర్శించారు. ఆయన వెంట మండలపార్టీ అధ్యక్షుడు సుంకెట రవి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు వెంకటి గణేష్ సంజీవ్ యాదవ్, రాకేష్, లింబాద్రి, శేఖర్, రవీందర్ ఉన్నారు.

'ఆర్టీసీ సేవలను వినియోగించుకోవాలి'

బోధన్‌రూరల్, సెప్టెంబర్ 11: ఆర్టీసీ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ రీజినల్ ఇన్‌చార్జి కాశీరాం అన్నారు. బుధవారం బోధన్ పట్టణంలోని పాత బస్టాండ్‌లో ఆర్టీసీ ఆధ్వర్యంలో లాజిస్టిక్ కార్గో సర్వీస్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్నాటక, మహారాష్ట్రలతో సహ ఇతర రాష్ట్రాల నుంచి బస్సులలో వేగంగా, సురక్షితంగా వస్తువులను డెలివరీ చేయడానికి ఈ సేవ ప్రారంభించబడిందన్నారు. ప్రజలకు అవసరమైన వస్తువులను సులభంగా ఇతర ప్రాంతాలకు, రాష్ట్రాలకు పంపవచ్చన్నారు. ఆర్టీసీ అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ కార్గో డీఎం పాల్, కార్గో ఇన్‌చార్జిలు సాహిద్, ఇర్ఫాన్, కౌన్సిలర్ జావీద్ పాల్గొన్నారు.

'గర్భిణులు పౌష్టికాహారాన్ని తీసుకోవాలి'

బోధన్‌రూరల్, సెప్టెంబర్ 11: గర్బిణులు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని అప్పుడు తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారని జిల్లా మహిళ సాధికారత కో-ఆర్డినేటర్ స్వప్న అన్నారు. బుధవారం సాలూర మండలంలోని హున్స గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రంలో మహిళలు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణీలకు పౌష్టికాహారం అందించడానికి ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గంగావేణి, జడ్పీహెచ్ఎస్ హెడ్‌మాస్టర్ రమా, ఏఎన్ఎం గంగామణి, అంగన్‌వాడీ టీచర్లు లావణ్య, రాధ, కమల పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాపై విద్యార్థులకు అవగాహన

బోధన్‌రూరల్, సెప్టెంబర్ 11 : విద్యుత్ సరఫరాపై విద్యార్థులు అవగాహన కలిగిఉండాలని ఉపాధ్యాయురాలు శాంతి అన్నారు. బుధవారం బోధన్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఐటీ ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీపై ఉపాధ్యాయురాలు విద్యార్థిని, విద్యార్థులకు పట్టణ శివారులోని బెల్లాల్ విద్యుత్ ఉత్పత్తి సబ్‌స్టేషన్‌కు తీసుకెళ్లి విద్యుత్ ఉత్పత్తిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యుత్ సరఫరా తదితర అంశాలపై ట్రాన్స్‌కో అధికారులు, విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు విద్యతో పాటు విద్యుత్‌పై కూడా అవగాహన కలిగి ఉండాలన్నారు.

పెర్కిట్ : అగ్ని, విద్యుత్ ప్రమాదాలను నివారించి వాటి నుంచి ఎలా కాపాడుకోవాలో అగ్నిమాపక అధికారి మధుసూ దన్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు మెళకువలు తెలిపారు. బుధవారం ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో నలంద పాఠశాలలో అగ్నిమాపక సిబ్బంది విద్యార్థులకు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిం చారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం ప్రసాద్, సాగర్, అధ్యా పక బృందం పాల్గొన్నారు.

ముప్కాల్‌లో జల సర్వే

ముప్కాల్, సెప్టెంబర్ 11: ఇటీవల కురిసిన వర్షాల కారణంగా వాతావరణంలో మార్పుల వల్ల సీజనల్ వ్యాధుల నివారణ కోసం ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో బుధవారం ముప్కాల్ మండల కేంద్రంలో ఇంటింటికి తిరుగుతూ జలసర్వే నిర్వహించారు. మలేరియా, డెంగ్యు, చికెన్‌గున్యా, వైరల్ ఫీవర్ అరికట్టడానికి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, ఆశవర్కర్‌లు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అంతర్ పాఠశాల క్రీడా పోటీలు

ముప్కాల్, సెప్టెంబర్ 11: బాల్కొండ మండల కేంద్రంలో రెండో రోజు ఉమ్మడి బాల్కొండ మండలాల అంతర్ పాఠశాల క్రీడలు కొనసాగుతున్నాయి. బుధవారం ముప్కాల్, బాల్కొండ, మెండోర మండలాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు అండర్-14 కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటాపోటీగా క్రీడాకారులు తలపడుతున్నారు. గురువారం ఫైనల్ పోటీలు జరుగుతాయని పీడీ రాజ్‌కుమార్ తెలిపారు.

యూనివర్సిటీకి చాకలి ఐలమ్మ పేరు ప్రకటించడంపై హర్షం

ఆర్మూర్‌టౌన్, సెప్టెంబర్ 11: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోఠి మహిళా యూనివర్సిటీకి చాకలి ఐలమ్మ పేరు పెడుతున్నట్టు ప్రకటించడంపై రజక ఐక్య వేదిక జిల్లా యువజన అధ్యక్షుడు మీరశ్రావణ్ హర్షం వ్యక్తం చేశారు. చాకలి ఐలమ్మ వర్ధంతి సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఐలమ్మ వీరత్వాన్ని, ధైర్యాన్ని గుర్తు చేసుకుంటూ ప్రతీ మహిళ ధైర్యంతో పోరాడాలని స్ఫూర్తి దాయకంగా ఉండాలని తెలుపుతూ యూనివర్సిటీకి చాకలి ఐలమ్మ పేరు ప్రకటించడంపై సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు జిల్లా జట్లు

సుభాష్‌నగర్, సెప్టెంబరు 11: రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు జిల్లా జట్ల ఎంపికలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ఆఫీసర్స్ క్లబ్‌లో బుధవారం జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈ ఎంపికలను నిర్వహించారు. ఇందులో ప్రతిభకనబర్చిన క్రీడాకారులు హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొంటారని తెలిపారు. బాలుర విభాగంలో డి.గణేష్, కెవిన్ రొనాల్డో, మహ్మద్ జహీరుద్దీన్, అద్విక్, సాత్విక్ చారి, బాలికల విభాగంలో స్పందన, శ్రీనిధి, అశ్రిత, రమాదేవి, సంజన, మానసలు ఎంపికైనట్లు తెలిపారు. ఈ ఎంపికలు డిఐఈవో రవికుమార్, వినయ్‌సాగర్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

యువత ఓటు హక్కును నమోదు చేసుకోవాలి

సుభాష్‌నగర్, సెప్టెంబరు 11: యువత ఓటు నమోదు చేసుకునేందుకు ప్రోత్సహించాలని నగర పాలక సంస్థ కమిషనర్ మంద మకరంద్ అన్నారు. వివిధ పార్టీల నాయకులతో బుధవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకొని ప్రజాస్వామ్యాన్ని సుసంపన్నం చేయాలని కోరారు. ఇందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు యువతను ప్రోత్సహించాలన్నారు. మరణించిన వారి వివరాలు, ఇళ్లు మారిన వివరాలను బూత్ లెవల్ ఆఫీసర్లకు ఎప్పటికప్పుడు తెలియజేసి ఓటరు జాబితాను సక్రమంగా ఉండేందుకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, తహసీల్దార్‌లు, నగర పాలక సంస్థ అధికారులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ కార్యదర్శిపై న్యాయవాది దాడి

ఖిల్లా, సెప్టెంబరు 11: బార్ అసోసియేషన్ కార్యదర్శి వసంత్‌పై మరో న్యాయవాది నవాతే జగన్ దాడి చేసిన ఘటన బుధవారం జిల్లా కోర్టు ఆవరణలో జరిగింది. బార్ కౌన్సిల్ ఇటీవలే నవాతే జగన్ న్యాయవాదిని సస్పెండ్ చేశారు. సదరు న్యాయవాది ఓ కేసు విషయంలో కొందరిని తీసుకొని బుధవారం కోర్టుకు వచ్చారు. దీనిని గమనించిన బార్ అసోసియేషన్ కార్యదర్శి వసంత్ కేసు కోసం వచ్చిన వ్యక్తులతో జగన్‌ను సస్పెండ్ చేశారని అతనికి కేసులు ఇవ్వకూడదని చెప్పారు. దీంతో ఆగ్రహానికి గురైన న్యాయవాది జగన్ కార్యదర్శిపై దాడి చేసి గాయపరిచారు. ఈ విషయమై నగరంలోని ఒకటవ టౌన్ పోలీసులకు బార్ అసోసియేషన్ కార్యదర్శి ఫిర్యాదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో డి.విజయ్‌బాబు తెలిపారు.

ఎత్తిపోతల పథకాన్ని పరిశీలించిన అధికారులు

మోపాల్, సెప్టెంబరు 11: నిజామాబాద్ రూరల్ మండలంలోని ఆకుల కొండూర్ గ్రామంలో ఉన్న ఎత్తిపోతల పథకాన్ని క్షేత్రస్థాయిలో బుధవారం లిఫ్ట్ ఇరిగేషన్ అధికారులు పరిశీలించారు. ఎత్తిపోతల పథకంలో చెడిపోయిన మోటార్లను అధికారులు పరిశీలించారు. ఇటీవల గ్రామస్తులు ఎత్తిపోతల పథకం పనిచేయడం లేదని రూరల్ ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఇరిగేషన్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. చెడిపోయిన మోటార్లను వెంటనే మరమ్మతులు చేసే విధంగా చూడాలని కోరారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పనులు జరిగే విధంగా చూస్తామని అధికారులు గ్రామస్తులకు భరోసా ఇచ్చారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

ఇందల్వాయి, సెప్టెంబరు 11: నిత్యం పౌష్టిక ఆహారం తీసుకోవడంతోనే అందరూ ఆరోగ్యంగా ఉంటారని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శోభ అన్నారు. పోషన మాసోత్సవాల్లో భాగంగా బుధవారం ఇందల్వాయి మండలంలోని ఇందల్వాయి, సిర్నాపల్లి, తిర్మన్‌పల్లి, తదితర గ్రామాల్లో గర్భిణులకు, బాలింతలకు, చిన్న పిల్లలకు పౌష్టిక ఆహారంపై అవగాహన కల్పించారు. గర్భిణులు ప్రతినిత్యం పౌష్టికాహారం తీసుకోవడం వల్ల పుట్టబోయే బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఆరోగ్య విస్తీర్ణ అధికారి శంకర్, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతిని కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత

ఇందల్వాయి, సెప్టెంబరు 11: ప్రకృతిని కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఫ్రంట్ లైన్ వారియర్స్ యూత్ సభ్యులు అన్నారు. మన ఊరు-మన ప్రకృతి కార్యక్రమంలో భాగంగా బుధవారం ఇందల్వాయి మండలంలోని నల్లవెల్లి గ్రామంలో ప్రతీ ఇంటికి మొక్కలు పంపిణీ చేసి ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రకృతిని కాపాడటం ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని చెట్లను పెంచితేనే మానవ మనుగడ ముందుకు సాగుతుందన్నారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల, రోడ్డుకు ఇరువైపులా మొక్కలను నాటారు. గ్రామం అంతా పచ్చదనంతో నిండిపోవాలని వారు ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మాధురి, పంచాయతీ కార్యదర్శి లావణ్య, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వెంకట్, సాగర్, శశిధర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, గంగాధర్, నర్సయ్య, ఎడ్ల శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

దుండగులను కఠినంగా శిక్షించాలి

- అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

నిజామాబాద్ కల్చరల్, సెప్టెంబరు 11: భక్తిశ్రద్ధలతో గణపతి నవరాత్రి ఉత్సవాలను నిర్వహించుకునే గణపతి మండపాలపై, గణపతిపై దాడులు నిర్వహించి విధ్వంసం చేయడం సమంజసం కాదని విగ్రహం ధ్వంసానికి పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. బుధవారం నగరంలోని బోయిగల్లిలోగల గణపతి మండపంలోని విధ్వంసానికి గురైన గణపతిని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినాయకుడి విగ్రహం చేతులు విరగొట్టి, కిరీటాన్ని ధ్వంసం చేయడం హేయమైన చర్య అని అన్నారు. యావత్ హిందూ సమాజం ఎంతో భక్తిశ్రద్ధలతో పూజించే హిందువుల ఆరాధ్య దేవుడైన వినాయకుడి విగ్రహంపై దాడి యావత్ హిందూ సమాజంపై చేసిన దాడిగా ఆయన వివరించారు. ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడిన వారిని 24గంటల్లోపు పట్టుకొని శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. గణపతి మండపాల వద్ద పోలీసులు గట్టి కాపలా పెట్టే విధంగా ఏసీపీ చర్యలు తీసుకోవాలని ఫోన్‌లో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రెండవ టౌన్ ఎస్సై, 28వ డివిజన్ కార్పొరేటర్ ఇల్లెందుల మమత ప్రభాకర్, బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మీనారాయణ, నందు, గణేష్ మండలి నిర్వాహకులు సంతోష్, విశ్వహిందూ పరిషత్ నాయకులు రమేష్, బిజెపి నాయకులు ఆనంద్, హరీష్, బాబిసింగ్ పాల్గొన్నారు.



విగ్రహాన్ని పరిశీలిస్తున్న అర్బన్ ఎమ్మెల్యే

శ్రద్ధానంద్ గంజ్‌లో అన్నదానం..

పెద్దబజార్: నగరంలోని శ్రద్ధానంద్ గంజ్‌లోని గుమస్తా సంఘం గణేష్ మండలి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా భారతదేశంలోని హిందువులు నిర్వహించే పెద్ద పండుగలలో ఒకటి గణపతి నవరాత్రి అని చిన్నపెద్ద తేడా లేకుండా అందరూ భక్తిశ్రద్ధలతో గణనాథుని పూజిస్తారని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు లక్ష్మీనారాయణ, ప్రభాకర్, కార్పొరేటర్ మాస్టర్ శంకర్, సత్యనారాయణ, అంజయ్య, హరీష్‌రెడ్డి, వెంకటరమణ పాల్గొన్నారు.

అటవీశాఖ ఆధ్వర్యంలో అమరవీరుల సంస్మరణ దినం



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

సుభాష్‌నగర్, సెప్టెంబరు 11: అటవీ ఉద్యోగుల అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని అటవీ శాఖ ఆధ్వర్యంలో అమరవీరులకు ఘన నివాళులర్పించారు. జిల్లా కేంద్రంలోని అటవీ శాఖ కార్యాలయంలో అమరవీరుల చిత్రపటానికి ఫారెస్టు డివిజనల్ ఆఫీసర్ సుధాకర్‌రావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంతకుముందు నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అమరవీరుల కుటుంబాలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అడవిని కాపాడటంలో అటవీశాఖ ఉద్యోగుల పాత్ర కీలకమన్నారు. అడవిని కాపాడటంలో కొందరు ఉద్యోగులు అమరులయ్యారని అన్నారు. వారిని స్మరించుకుంటూ అటవీ ఉద్యోగుల అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ప్రతియేటా జరుపుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఆర్‌వోలు సంజయ్‌గౌడ్, రవి మోహన్‌భట్, రాధిక, బీట్ ఆఫీసర్లు, సెక్షన్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

'క్షణికావేశంలో ఆత్మహత్యలు'

పెద్దబజార్, సెప్టెంబరు 11: యువత మానసిక ఆరోగ్యంతో జీవితంలో ఏదో కోల్పోయామని క్షణికావేశంతో ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఇండియన్ సైకియాట్రిక్ సొసైటీ తెలంగాణ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ శ్రీధర్‌రాజు అన్నారు. బుధవారం నగరంలోని పాత కలెక్టరేట్ గ్రౌండ్‌లో మార్నింగ్ వాకర్స్ ఆధ్వర్యంలో ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రజలు ఆత్మహత్య నివారణ కోసం అవగాహన కరపత్రాలను ఆవిష్కరించారు. ఐఎంఏ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ దామోదర్‌రావు, డాక్టర్ శ్రీశైలం, రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ విశాల్ ఆకుల మాట్లాడుతూ ఆత్మహత్య ఆలోచనలు ఉన్న వారిని కుటుంబ సభ్యులు, లేదా మిత్రులు ముందుగానే గుర్తించి వారి భవిష్యత్తు గురించి తెలియజేయాలని తెలిపారు. అనంతరం నగరంలోని రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు ఆత్మహత్య నివారణపైన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ జార్జిరెడ్డి, వైద్యులు కరుణాకర్, చక్రపాణి, జీవన్‌రావు, జేసీఐ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు డిజిటల్ అలారం వితరణ

సిరికొండ, సెప్టెంబరు 11: మండలంలోని గడ్కోల్ ప్రాథమిక పాఠశాలకు 2001 బ్యాచ్ పూర్వ విద్యార్థులు డిజిటల్ అలారాన్ని ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. తాము చిన్నప్పుడు చదువుకున్న పాఠశాలకు చిరు సహాయాన్ని అందించాలనే లక్ష్యంతో డిజిటల్ ఆలారాన్ని అందజేయడం జరిగిందని పూర్వ విద్యార్థులు ప్రభు తెలిపారు. ఈకార్యక్రమంలో సంజీవ్, గంగారెడ్డి, ప్రసాద్, నవీన్, తస్లీమ్ పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

- ఆసుపత్రికి తరలించిన స్థానికులు

సిరికొండ, సెప్టెంబరు 11: సిరికొండ అడవిలో పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని లోకేషన్ ఆధారంగా గుర్తించిన ఎల్.రామ్ మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్ ఆసుపత్రికి తరలించారు. ఎస్సై కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని జగదాంబ తండాకు చెందిన గణేష్ అనే యువకుడు బుధవారం సాయంత్రం తండా నుంచి బయటికి వచ్చి పురుగు మందు, మద్యాన్ని కొనుగోలు చేసి చనిపోతున్నానని సిరికొండ అడవిలోకి వెళ్లాడు. గణేష్ అన్న కొడుకు ఆయన కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌కు వచ్చిన విషయం చెప్పడంతో సెల్ నెంబర్ ఆధారంగా ఎస్సై లోకేషన్ గుర్తించి తన సిబ్బందితో వెళ్లారు. అప్పటికే మద్యంలో పురుగుల మందు కలుపుకుని తాగాడని గుర్తించిన ఎస్సై వెంటనే వాహనంలో సిరికొండ ఆసుపత్రికి తరలించారు. ఇక్కడ వైద్యులు నిజామాబాద్ తీసుకెళ్లాలని సూచించడంతో హుటాహుటిన అంబులెన్స్‌లో నిజామాబాద్ ఆసుపత్రికి తరలించారు. గణేష్ పరిస్థితి విషమంగా ఉందని, కుటుంబ కలహాలే ఆత్మహత్యాయత్నానికి కారణమని సమాచారం.

'కేంద్ర ప్రభుత్వంపై పోరాటాలకు సిద్ధం'

పెద్దబజార్, సెప్టెంబరు 11: కార్మికుల పట్ల నయా ఉదారవాద విధానాలను అవలంబిస్తున్న కేంద్ర ప్రభుత్వంపై పోరాటాలకు సిద్ధమని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ పిలుపునిచ్చారు. బుధవారం నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం నిర్వహించారు.

పాముకాటుతో యువకుడి మృతి

మోపాల్, సెప్టెంబరు 11: మండలంలోని అమ్రాబాద్ గ్రామ పంచాయతీ పరిధిలోని గుండ్యానాయక్ తాండాకు చెందిన నేనావత్ వరుణ్ (14) మంగళవారం రాత్రి పాముకాటుతో మరణించాడు. మండలంలోని నేనావత్ వరుణ్ కుటుంబ సభ్యులతో కలిసి రాత్రి నిద్రిస్తుండగా పాము కుట్టడంతో వెంటనే స్పందించిన కుటుంబ సభ్యులు అదే రాత్రి జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే బాలుడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. యువకుడు 8వ తరగతి చదువుకుంటున్నాడు. కుమారుడు మరణించడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. వీరి కుటుంబంలో విషాదచాయలు అలుముకున్నాయి.

ఆలయంలో హుండీ లెక్కింపు

మోపాల్, సెప్టెంబరు 11: మాధవనగర్ సాయిబాబా ఆలయంలో బుధవారం దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమీషనర్ విజయ రామారావు ఆధ్వర్యంలో హుండీ లెక్కింపును నిర్వహించడం జరిగిందని ఈవో శ్రీరాం రవీందర్‌గుప్త తెలిపారు. మూడు నెలల 15 రోజులకు సంబంధించిన ఆదాయం 3లక్షల 28వేల 428 రూపాయలు భక్తులు కానుక రూపంలో హుండీలో వేయడం జరిగిందని తెలిపారు. హుండీ లెక్కింపులో పూజారి మాణిక్యశర్మ, హరిశర్మ, రాజుశర్మ, జూనియర్ అసిస్టెంట్లు హరితరాణి, లత, సంతోష్‌కుమార్, పాల్గొన్నారు.

చెరువులను పరిశీలించిన అధికారులు

మోపాల్, సెప్టెంబరు 11: గ్రామీణ ప్రాంతాల్లో గణేష్ నిమజ్జనం కోసం గ్రామాల్లో ఉన్న చెరువులను బుధవారం ఎస్సై యాదగిరి, తహశీల్దార్ రామేశ్వర్, ఎంపీడీవో లింగంలు సందర్శించారు. ఈనెల 17వ తేదీన గ్రామీణ ప్రాంతంలో గణేష్ నిమజ్జనం జరుగుతుండటంతో గ్రామాల చెరువుల వద్ద అన్ని ఏర్పాట్లు చేసేందుకు అధికారులు పర్యవేక్షించారు. గణేష్ నిమజ్జనం రోజు ఎలాంటి అవాంతరాలు జరుగకుండా అన్ని ఏర్పాట్లను చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. చెరువుల వద్ద విద్యుత్, క్రేన్‌ల సౌకర్యం ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగానే గ్రామాల్లోని చెరువులను అధికారులు పరిశీలించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ధర్పల్లి, సెప్టెంబరు 11: సీజనల్ వ్యాధులపై గ్రామస్థాయి అధికారులు, కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని ఎండివో బాలకృష్ణ సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య పనులను వేగవంతం చేయాలన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో డెంగ్యూ వ్యాధి ప్రబలే అవకాశం ఉన్నందున గ్రామస్థాయిలో కార్యదర్శులు అప్రమత్తంగా ఉండి దోమల నివారణ మందును పిచికారీ చేయాలని సూచించారు. అంటు వ్యాధులు, విషజ్వరాలు, డెంగ్యూ జ్వరాలు రాకుండా చూడాలని ఆదేశించారు. గ్రామాల్లో క్లోరినేషన్ క్రమం తప్పకుండా చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీవో భాస్కర్, కార్యదర్శులు పాల్గొన్నారు. అంతకుముందు మండలంలోని మైలారం గ్రామంలో జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు.

క్రీడాకారులను ప్రోత్సహించేందుకే డీఎస్ స్మారక క్రీడాపోటీలు

సుభాష్‌నగర్, సెప్టెంబరు 11: క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహించేందుకే ధర్మపురి శ్రీనివాస్ స్మారక క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు మాజీ మేయర్ ధర్మపురి సంజయ్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. సెప్టెంబర్ 26న ధర్మపురి శ్రీనివాస్ జయంతి సందర్భంగా నగరంలోని జిల్లా క్రీడా అథారిటీ మైదానంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాస్కెట్‌బాల్, బాక్సింగ్ క్రీడాంశాల్లో పాఠశాలలు, ఇంటర్మీడియెట్ స్థాయిలో బాలబాలికల విభాగంలో పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ నెల 15న సాయంత్రం 5గంటలలోపు పాఠశాలలు, కళాశాలల్లో ఆన్‌లైన్ ద్వారా గానీ, వాట్సప్ ద్వారా గానీ ఎంట్రీలు చేసుకోవాలన్నారు. 23న పోటీలు ప్రారంభమవుతాయన్నారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి రూ.5వేలు, ద్వితీయ బహుమతి పొందిన వారికి రూ.2వేలు నగదు ఇవ్వనున్నట్లు తెలిపారు. క్రీడాకారులకు మధ్యాహ్న భోజన వసతి కల్పించనున్నట్లు తెలిపారు. కబడ్డీ, బాలీబాల్, బాస్కెట్‌బాల్ నందు ప్రతీ టీమ్‌లో 10మంది క్రీడాకారులు మాత్రమే పాల్గొనాలని, ఖోఖో క్రీడానందు 12 మంది క్రీడాకారులు పాల్గొనాలని అన్నారు. పాఠశాల తరఫున 6 నుంచి 10వ తరగతి విద్యార్థులు, కళాశాల తరఫున ఇంటర్మీడియెట్ మొదటి, రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు మాత్రమే అర్హులని తెలిపారు. క్రీడల్లో ప్రథమ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.10 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన జట్టుకు 5వేల రూపాయల నగదు ఇవ్వనున్నామని అన్నారు. బాక్సింగ్‌లో ప్రథమ స్థానం నిలిచిన క్రీడాకారులకు 3వేల రూపాయలు, ద్వితీయ స్థానంలో నిలిచిన క్రీడాకారులకు 2వేల రూపాయల నగదు అందించడం జరుగుతుందన్నారు. గెలుపొందిన క్రీడాకారులకు నగదు బహుమతితో పాటు వ్యక్తిగత షీల్డ్ ఇవ్వనున్నామని అన్నారు. మిగతా వివరాల కోసం ధర్మపురి సంజయ్ 7774956789, డి.సాయిలు 9848060999, సురేష్ 9948287937, విద్యాసాగర్‌రెడ్డి 9440066250 నెంబర్లను సంప్రదించాలని కోరారు. ఈ సమావేశంలో క్రీడల కమిటీ సభ్యుడు డి.సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు

మోపాల్, సెప్టెంబరు 11: పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ సమక్షంలో నగరంలోని సారంగపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీకి చెందిన మాజీ ఎంపీటీసీ హరిచంద్ నాయక్ ఆధ్వర్యంలో సుమారు 50 మంది బుధవారం హైదరాబాద్‌లో కాంగ్రెస్‌లో చేరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధిని చూసి ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరడం జరిగిందని హరిచంద్ నాయక్ తెలిపారు. తనతో పాటు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు చేరినట్లు ఆయన తెలిపారు.

రేపు ఉమ్మడి జిల్లా కరాటే పోటీలు

సుభాష్‌నగర్, సెప్టెంబరు 11: ఉమ్మడి జిల్లాల కరాటే పోటీలు శుక్రవారం నిర్వహిస్తున్నట్లు నిజామాబాద్ జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ ఎం.నాగమణి తెలిపారు. కామారెడ్డి జిల్లా దోమకొండలోని ముదిరాజ్ ఫంక్షన్‌హాల్‌లో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అండర్-14 బాల బాలికలు, అండర్-17 బాల బాలికల విభాగంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 10గంటల వరకు ముదిరాజ్ ఫంక్షన్‌హాల్‌కు చేరుకోవాలని కోరారు. వివిధ కేటగిరిలలో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు వివరాల కోసం 9347216426 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలి

పెద్దబజార్, సెప్టెంబరు 11: విద్యార్థులు తమ ఆరోగ్యం పట్ల అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ మహిళా సాధికారత, వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. బుధవారం నగరంలోని చంద్రశేఖర్ కాలనీలోగల బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో ఆరోగ్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీహెచ్ఈ స్వామి సులోచన హాజరై మాట్లాడుతూ హోలిస్టిక్ హెల్త్ పొందడానికి విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నియమాలను ఎలా పాటించాలో తెలియజేశారు. సంపూర్ణ ఆరోగ్యం, బ్యాలెన్స్, డైట్, ఈట్‌రైట్ రక్తహీనత, డివార్మింగ్ సీజనల్ 98 డిసిజెస్, వ్యక్తిగత పరిశుభ్రత, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, మానవ అక్రమ రవాణా, జీవన నైపుణ్యాలు, ఆరోగ్యకరమైన అలవాట్లను వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ మహిళా సాధికారత కేంద్రం సిబ్బంది పుష్ప, కవిత, ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దీక్షకు మద్దతుగా నగరంలో ధర్నా

సుభాష్‌నగర్, సెప్టెంబరు 11: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీల ఆధ్వర్యంలో ఈనెల 11న ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద చేపట్టిన ధర్నాకు మద్దతుగా జిల్లా కేంద్రంలో ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని పూలాంగ్ వద్ద గల అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సక్కి విజయ్ కుమార్ మాట్లాడుతూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును ఉపసంహరించుకోవాలన్నారు. రాజ్యాంగానికి లోబడి పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టి 341 అధికరణ ప్రకారం వర్గీకరణ చేపట్టాల్సి ఉండగా ఎస్సీ, ఎస్టీ వర్గీకరించే అధికారాలను రాష్ట్రాలకు ఇవ్వడం రాజ్యాంగ వ్యతిరేకం అన్నారు. సుప్రీం కోర్టు తీర్పును తాము తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో రాంచందర్ గైక్వాడ్, నాగరాజు, ఆనంద్, సుశీల్, వినయ్, కిష్టయ్య, రాజేందర్, గంగాధార్, సిద్ధార్థ కుమార్, మారుతి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుల సర్వీసులను పెంచాలి

సుభాష్‌నగర్, సెప్టెంబరు 11: ఆర్టీసీ బస్సు సర్వీసులను పెంచాలని పనిచేసే సిబ్బందిని పెంచాలని డిమాండ్ చేస్తూ ప్రగతిశీల మహిళా విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో డిపో-1 మేనేజర్‌కు వినతి పత్రం అందజేశారు. నగరంలోని డిపో-1 కార్యాలయంలో మేనేజర్ సంపూర్ణ ఆనంద్‌ను కలిసి సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా ప్రగతిశీల మహిళా సంఘం ప్రధాన కార్యదర్శి సంధ్యారాణి మాట్లాడుతూ తాడెం, మోపాల్, కులాస్‌పూర్, కంజర, ముల్లంగి, డిచ్‌పల్లి బస్టాండ్‌ల వరకు బస్సుల సౌకర్యం పెంచాలని కోరారు. సిరిపూర్, ముదక్‌పల్లి, బాడ్సి, సింగంపల్లి గ్రామాలకు సైతం బస్సు సౌకర్యం పెంచాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కర్క గణేష్, సాయి బాబా, లలిత, సువర్ణ, భాగ్య, భూలక్ష్మి, లావణ్య, నాగమణి పాల్గొన్నారు.